

నేటి దినపత్రిక

# సూర్య


www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం

02 ఫిబ్రవరి 2026 పేజీలు : 08


## కేంద్ర బడ్జెట్‌పై ఎంపీ హర్షం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :**

భారత ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026-27 ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు పునాదిని సూచిస్తోందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. అందరికీ అభివృధి అనే నినాదాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. న్యూఢిల్లీ పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్ 2026-27పై ఆయన హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా ఎన్డీఏ సర్కార్ ముందుకు సాగుతోందని చెప్పారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2026-27ని స్వాగతిస్తూ.. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త వృద్ధి అవకాశాలను కల్పిస్తోందని తెలియజేశారు. వికసిత్ భారత్ సాధించాలనే దీర్ఘకాలిక లక్ష్యంతో కూడినదిగా అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు ఉన్నప్పటికీ, మోదీ ప్రభుత్వం ఆర్థిక లోటును తగ్గించడం, రుణ-జీడీపీ నిష్పత్తిని తగ్గించడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను కొనసాగించి,

-మిగతా 2లో

అమ్మ తోడు ఒక్కరోజు అయినా.. ప్రాక్టికల్స్ జరుగవు. అసలు కాలేజీలో ల్యాబ్ ఉంటే ఒట్టు. అయినా సెంట్ మార్కులు సాధిస్తారు. అందరూ కాదోయ్.. ఇది కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీలకు మాత్రమే వర్తిస్తుంది. ఇంటర్ బోర్డు అధికారులకు కాసుల పంట పండిస్తోంది.

## ఇంటర్ ప్రాక్టికల్స్‌లో.. మార్కుల మాయాజాలం




### సినిమా సెట్టింగ్‌ను మురిపిస్తున్న ప్రాక్టికల్ ల్యాబ్‌లు

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

జిల్లావ్యాప్తంగా ఆదివారం నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు రెండు విడతలుగా 86 సెంటర్‌లలో ఈ పరీక్షలను అధికారులు నిర్వహించడం జరుగుతుంది. అయితే ఇక్కడ నుంచే మొదలవుతుంది అసలైన కథ.. సహజంగా ప్రభుత్వ కాలేజీల్లో అయితే ప్రతి సబ్జెక్టుకు ఒక ల్యాబ్ ఉంటుంది. ఎంపీసీ విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ విద్యార్థులకు, బైపీసి విద్యార్థులకు బోటని, జువాలజీ ల్యాబ్‌లు ప్రత్యేకంగా వేర్వేరుగా ఉంటాయి. ప్రతివారం రెండు ప్రాక్టికల్ పిరియడ్‌లు టైమ్ టేబుల్ ప్రభుత్వ కాలేజీలో ఏర్పాటు చేస్తారు. అలా సంవత్సరానికి ఒక్కో సబ్జెక్టుకు 15నుంచి 18 ప్రాక్టికల్ పీరియడ్స్ ఏర్పాటు చేసి రికార్డలను విద్యార్థులచే రాయించడం జరుగుతుంది. ఇలా జరిగిన తర్వాత రికార్డులు రాసిన విధానాన్ని బట్టి మార్కులు కూడా వేయడం జరుగుతుంది. సంవత్సరం అంతా ప్రభుత్వ విద్యార్థులు ఇలా ప్రాక్టీకల్స్ ప్రక్రియను పూర్తి చేసినా.. 30కి 30 మార్కులు రావు. అయితే కొన్ని ప్రయివేట్, కార్పొరేట్ కాలేజీలలో అసలు ల్యాబ్‌లు ఉండవు. వారం..వారం ప్రాక్టీకల్స్ ఉండవు. ల్యాబ్‌లే లేనప్పుడు విద్యార్థులు ప్రాక్టీకల్స్ ఎలా చేస్తారు. ఇది ఇంటర్ అధికారులు పర్యవేక్షణ లోపం.. ఆ కాలేజీలలో ఏడాదంత ప్రాక్టీకల్స్ జరిపేందుకు లేకపోయినా సెల్ఫ్ ఎక్సమ్

-మిగతా 2లో

## ప్రసన్న వ్యాఖ్యలకు.. భగ్గుమన్న టీడీపీ నేతలు

- బుచ్చిరెడ్డిపాలెంలో భారీ ర్యాలీ చేపట్టిన టీడీపీ నాయకులు
- ప్రసన్నకుమార్ రెడ్డి దిష్టిబొమ్మను చెప్పుతో కొట్టిన నేతలు
- చంద్రబాబు గురించి మాట్లాడే స్థాయి ప్రసన్నకు లేదు
- గత ప్రభుత్వంలో తట్ట మట్టి కూడా వేయలేదన్నది నిజం
- ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలోనే కోవూరులో అభివృద్ధి



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురించి మాట్లాడే స్థాయి ప్రసన్న కుమార్‌కు లేదని తెలుగుదేశం పార్టీ నేతలు అన్నారు. కోవూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి.. సీఎం చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలో

-మిగతా 2లో

## కార్యకర్తలే వైసీపీకి జీవం

మాజీ మంత్రి కాకాణి

వివరాలు 3లో

## అంబటి దిష్టిబొమ్మ శవయాత్ర





దేవ దేవుని ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలపై..

## కక్షగట్టిన వైసీపీ

- ప్రతిపక్షానికి సైతం పనికిరారని ప్రజలతో తిరస్కరించబడ్డ వైసీపీ నేతలు, ప్రజల మనోభావాలు దెబ్బతీస్తున్నారు
- తిరుమల పవిత్రతను కాపాడటానికి ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందని ప్రకటన
- సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రతిసారి ప్రజల దృష్టిని మరల్చటానికి ప్రయత్నిస్తున్న వైసీపీ అని.. ఆక్షేపించిన మంత్రి ఆనం

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :**


మాధవ సేవే మానవ సేవ, మానవ సేవే మాధవసేవ అనే నినాదాన్ని త్రికరణ శుద్ధిగా ఆచరించి అమలు చేస్తున్న ప్రభుత్వం తమదని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. దేవ దేవుని సంస్కృతి, సాంప్రదాయాలు, తిరుమల ప్రసాదాలను సైతం వ్యాపారమయం చేసిన వైసీపీకి వారి నాయకులకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ.. కూటమి నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరు రంగనాథస్వామి దేవాలయంలో మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి మంత్రి ఆనం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ.. తిరుమల పవిత్రత గురించి దేవుని ఆచార వ్యవహారాలు ప్రసాదాల గురించి పదేపదే చర్చకు రావడం దురదృష్టకరమన్నారు. సరైన ఆలోచన విధానం నిర్దిష్ట ఎజెండా లేనటువంటి పార్టీ వైకాపా పార్టీ అన్నారు. తప్పులు చేస్తూ సైతం ఎదుటి వారిపై నిందలు మోపే కుసంస్కృతి ప్రతిపక్షానికి సొంతమన్నారు. గత 18 మాసాలుగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి

-మిగతా 2లో

# జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా శాంతకుమారి ప్రమాణ స్వీకారం

## జిల్లా విద్యారంగానికి గర్వకారణం : జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా మాజీ ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి సతీమణి శాంతకుమారి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా విద్యా–సాంస్కృతిక రంగానికి గర్వకారణమని జనసేన పార్టీ నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు ఉన్న భవనాలు మాత్రమే కాకుండా జ్ఞానానికి ఆలయాలు, విద్యార్థులకు దిశానిర్దేశం చేసే దీపాలు, సమాజాన్ని విజ్ఞానవంతంగా తీర్చిదిద్దే కేంద్రాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అలాంటి కీలక బాధ్యతను శాంతకుమారి స్వీకరించడం ద్వారా జిల్లాలోని విద్యార్థులు, యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎన్నో అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ తరపున, పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆలోచనలకు అనుగుణంగా విద్య, విజ్ఞానం, విలువల ఆధారిత సమాజ నిర్మాణానికి ఎల్లప్పుడూ సంపూర్ణ మద్దతు ఇస్తామని స్పష్టంగా తెలిపారు. శాంతకుమారి తన పదవీకాలంలో గ్రంథాలయాలను ఆధునీకరించి, డిజిటల్ సదుపాయాలను విస్తరించి, పేద



విద్యార్థులకు జ్ఞాన ద్వారాలు మరింత విస్తృతంగా తెరవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు.

# బీజేవైఎం రాష్ట్ర సహా కోశాధికారిగా మురగ నరేష్




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని మూలా పేటకు చెందిన మురగ నరేష్ కు భారతీ య జనతా పార్టీ యువ మోర్చాలో రాష్ట్ర సహా య కోశాధికారిగా పదవి ఇచ్చారు. చిన్నతనం నుండి ఆర్‌ఎస్‌ఎస్‌లో స్వయం సేవక్‌గా శిక్షణ పొంది పలు బాధ్యతలు నిర్వహించి అనంతరం విద్యార్థి దశలో ఏబీవీపీ కార్యకర్తగా చేరి గతంలో ఏబీవీపీ విఆర్. కళాశాల అధ్యక్షులుగాను, నెల్లూరు నగర సహాయ కార్యదర్శిగాను, నగర సెంట్రల్ జోన్ ఇన్చార్జిగాను, నగర కార్యదర్శి గాను, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగాను, ఎస్ఎఫ్‌డి నెల్లూరు జిల్లా కన్వీనర్ గాను, అనంతరం బిజెపిలో చేరి భారతీయ జనతా యువమోర్చాలో నెల్లూరు నగర ప్రధాన కార్యదర్శి గాను, మూలాపేట మండల బిజె పి అధ్యక్షులు గాను, బీజేవైఎం నెల్లూరు జిల్లా ప్రధా న కార్యదర్శి గాను, బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం బీజేవైఎం రాష్ట్ర సహాయ కోశాధికారిగా నియమించా రు. ఆయనకు పై బాధ్యతను ఇచ్చిన రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షులు కే.సునీల్ రెడ్డి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివిఎన్. మాధవ్, రాష్ట్ర బిజెపి ఆర్గనైజింగ్ సెక్రటరీ నూకల మధుకర్, నెల్లూరు జిల్లా బిజెపి అధ్యక్షులు ఎస్.వంశీధర్ రెడ్డి, ఇతర జిల్లా, రాష్ట్ర నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. అలాగే తనపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను సమర్ధవం తంగా నిర్వహించి రాష్ట్రం నలుమూలల పర్యటించి అన్నివర్గాల విద్యార్థి, యువతను సమీకరించి పార్టీ లోకి ఆహ్వానించి పార్టీని బలోపేతం చేస్తానన్నారు. అలాగే రాష్ట్ర, కేంద్ర పార్టీలు ఇచ్చే అన్ని కార్యక్రమా లను అన్ని వర్గాల ప్రజలలోకి విశేషంగా తీసుకువెళ తానని, రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని, విద్యార్థి, యువతలో దేశభక్తి, జాతీయ భావాలు, నైతిక విలు వలతో కూడిన సమాజంలో అన్ని వర్గాలలో అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించే దిశగా పనిచేస్తానని మురగ నరేష్ తెలిపారు.

# దేవ దేవుని ఆచార వ్యవహారాలు సాంప్రదాయాలపై కక్షగట్టిన వైసీపీ

(మొదటి పేజీ తరువాయి)

ఓర్వలేని తనంతో వికృత రాజకీయ క్రీడను ప్రతిపక్ష పార్టీ ప్రారంభించిందని దుమ్మెత్తి పోశారు. ప్రతిపక్ష హోదాకు సైతం పనికిరారని ప్రజలు నిర్వ ద్ధంగా తిరస్కరించిన పార్టీ అత్యంత జిగుస్సాకరమైన రాజకీయాలు చేస్తుందన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రయత్ని స్తుందన్నారు. తిరుమల లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడలేదని వారికి వారే క్లీన్ చిట్ ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సిట్ పూర్తిస్థాయి నివేదిక సమర్పించక ముందే వారే విపరీత భూషణం చేస్తున్నారన్నారు. నెయ్యి సరఫరా చేసే కాంటాక్ట్‌ను తమ దగాకోరు సంస్థలకు కట్టబెట్టడానికి టెండర్ నిబంధనలను అన్నిటిని మార్చేసి కల్తీ జరగడానికి ఆజ్యం పోసిన గత ప్రభుత్వ నిర్వాకాలను ప్రజలు గమనించాలన్నారు. అనర్హులకు టెండర్ దాఖలకు అవకాశం కల్పించడానికి



టీటీడీ చైర్మన్ పీఏకు కోట్ల నిధులు అందజేస్తే, మిగిలిన పెద్ద నాయకులు ఏ మేరకు దోపిడీ చేశారో అర్థం అవుతుందన్నారు. అదేవిధంగా రాజకీయాలలో వాడకూడని భాష ఉపయోగిస్తూ ముఖ్యమంత్రిని అనరాని మాటలంటున్న వైసీపీ నాయకుల మాటలను సభ్య సమాజం ఆమోదించదన్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్న తెలుగు దేశం పార్టీలోని 2 కోట్ల మంది సభ్యులు ఒకేసారి గోవిందా గోవిందా.. అని నామస్మరణ చేస్తే ప్రతిపక్షం నామరూ పాలు లేకుండా పోతుందని హెచ్చరించారు. భారతదేశం అనేక మతాలు, కులాలు కలగలిసిన గొప్ప దేశమని, వివిధ రకాల వ్యక్తులు ఒకరినొ కరు గౌరవించుకునే గొప్ప సంస్కృతి మన భారత దేశ సొంతమన్నారు. అటువంటి గొప్ప దేశంలో సభ్యత సంస్కారం లేని జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ పనిచేస్తుందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడడానికి ఆహారహం ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించే దిశగా ముందుకు పోతుందన్నారు. కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణ రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, నాయకులు గిరిధర్ రెడ్డి, విజయ భాస్కర్ రెడ్డి, పట్టాభిరామిరెడ్డి, కూటమి నాయకులు సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్న వ్యాఖ్యలకు భగ్గుమన్న టీడీపీ నేతలు



(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టి.. ప్రసన్న కుమార్ దిష్టి బొమ్మను చెప్పులతో కొట్టారు. ఈ సందర్భంగా రూరల్ పార్టీ అధ్యక్షులు బెజవాడ జగదీష్ మాట్లాడుతూ.. ప్రసన్నకుమార్ రెడ్డికి రాజకీయ భిక్ష పెట్టిందే చంద్రబాబు నాయుడు అని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ప్రసన్నకుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఒక్క తట్ట మట్టి కూడా వేసిన పాపాన పోలేదన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతమ్మ గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యేకు లేదని ఘాటుగా స్పందించారు. నేడు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ ఆధ్వర్యంలో ప్రతి మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. మరోసారి సీఎం చంద్రబాబుపై, ఎమ్మెల్యే ప్రశాంతమ్మపై వ్యాఖ్యలు చేస్తే మరింత ఘాటుగా స్పందిస్తామని చెప్పారు. మాజీ మండలాధ్యక్షులు బత్తల హరికృష్ణ మాట్లాడుతూ.. తెలుగు జాతి ముద్దుబిడ్డ చంద్రబాబుపై ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలు తెలుగు ప్రజలు తలదించుకునేలా ఉన్నాయన్నారు. బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలోనే మలిదేవి డ్రైన్‌కు శంకుస్థాపన జరిగిందన్నారు. బుచ్చి మండలంలోని అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్లు వేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పూటకో మాట మార్చే నీలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. బుచ్చి క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు మాట్లాడుతూ.. ప్రశాంతమ్మ చేతిలో 50 వేలు ఓట్లతో ఓడిపోయిన ప్రసన్న కుమార్ రెడ్డి గత చరిత్ర తెలుసుకోవాలన్నారు. నోటి దూలతోనే తన రాజకీయాన్ని నాశనం చేసుకున్నారని, ఇదే కొనసాగితే భవిష్యత్తులో ప్రశాంతమ్మ చేతిలో లక్ష ఓట్లతో ఓటమి పాలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు గుత్తా సేనయ్య, టౌన్ మాజీ అధ్యక్షులు ఎంవి శేషయ్య, మండల క్లస్టర్ ఇంచార్జ్ వింజం రామానాయుడు, పటేల్ సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు పుట్టా సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ ప్రాక్టికల్స్‌లో.. మార్కుల మాయాజాలం

(మొదటి పేజీ తరువాయి)




సెంటర్‌ను ఆ కాలేజీలకు కేటాయిస్తారు. అన్నీ అప్పటికప్పు డు సినిమా సెట్టింగ్‌ను మురిపించే విధంగా ఆయా సబ్జెక్టులకు బయట అద్దెకు తెచ్చి ల్యాబ్ సెట్టింగ్ చేపడతారు. పర్యవేక్షణకు వచ్చిన ఎక్జామినర్లు.. అమ్యామ్యలు తీసుకొని 30కి 30 మార్కులు వేసి చేతులు దులుపుకుంటారు. అందుకే ఇంటర్ ప్రాక్టికల్స్ వచ్చాయంటే.. అధికారులకు కాసుల పండగే. ప్రయివేట్, కార్పొరేట్ విద్యార్థులకు మార్కుల జాతరలా ఉంటుంది. పాపం సంవత్సరమంతా కష్టపడ్డ ప్రభుత్వ కాలేజీ విద్యార్థులకు రాని మార్కులు వారికి మాత్రం అవలీలగా రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మరికొంత మంది ఎక్జామినర్ రూరల్ ప్రాంతం నుంచి నగరానికి ఎక్జామినర్‌గా వస్తే వారి సదుపాయలు స్టార్ హోటల్స్‌లోనే.. చెప్పలేని విధంగా ఉంటాయి. ఈ తంతుతో జరిగే ప్రాక్టీకల్స్ పరీక్షలు ప్రతిభ కలిగిన విద్యార్థులు పూర్తిగా నష్టపోతారన్న అభిప్రాయాలు అందరిలో వ్యక్తమవుతున్నాయి.

# కేంద్ర బడ్జెట్‌పై ఎంపీ హర్షం

(మొదటి పేజీ తరువాయి)

అధిక వృద్ధిని సాధించిందన్నారు. మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు భారీ ప్రోత్సాహం ఎంపీ రూ.12.2 లక్షల కోట్లకు పెరిగిన మూలధన వ్యయాన్ని ప్రశంసిస్తూ, ఇది ఉపాధి కల్పన, కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రైవేట్ పెట్టుబడులను ప్రేరేపిస్తుందన్నారు. నగర మౌలిక సదుపాయాల అభివృద్ధి తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, విశాఖపట్నం వంటి నగరాలను బలోపేతం చేస్తుందనీ చెప్పారు. ఎంఎస్‌ఎంఈలపై బడ్జెట్‌ను ప్రశంసిస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది అవుతుందన్నారు. రూ.10 వేల కోట్ల ఎస్‌ఎంఈ గ్రోత్ ఫండ్, ట్రేడ్స్ ద్వారా క్రెడిట్‌కు మెరుగైన అందుబాటు, సరళీకృత సమ్మతి వంటి కీలక చర్యలకు కేంద్రం శ్రీకారంతో చుట్టిందని చెప్పారు.

# కార్యకర్తలే వైసీపీకి జీవం : కాకాణి

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని ఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. మండల స్థాయి సమావేశానికి భారీగా తరలివచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాకాణికి ఘన స్వాగతం పలికారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటి ఉండి పనిచేసిన కార్యకర్తలకు,ప్రజల్లో మంచి పాలనా పరమైన బాధ్యతలు అప్పగిస్తామన్నారు.ప్రతి నియోజకవర్గంలో అన్నీ వర్గాల వారికి గ్రామ స్థాయి కమిటీలలో అవకాశం కల్పిస్తామని తెలిపారు. గ్రామస్థాయిలో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు కార్డులు ఇచ్చి, రాబోయే జగనన్న ప్రభుత్వంలో పెద్దపీట వేస్తామన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ సంఘాలు ఏర్పాటు చేసి, నియోజకవర్గాని కి 8 వేల నుండి ,10 వేల మంది గ్రామ కమిటీ సభ్యులను ఏర్పాటు చేసి, రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల మందితో అతిపెద్ద జగన్మోహన్ రెడ్డి సైనికులను తయారు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన ప్రాంతీయ పార్టీలల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒకటిని, 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఒక్కటే పోటీ చేసి 40 శాతం ఓట్లు సంపాదించామని, అన్ని పార్టీలు కూటమిగా ఏర్పడి పోటీచేసినా 58 శాతంకి మించి ఓట్లు రాలేదంటే ఈ రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంత బలంగా ఉందో ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదన్నారు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం లో జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు చేసిన అసత్య వ్యాఖ్యలకు బేషరుతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలి. శ్రీవారి ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం ఎంతో మంది భక్తులు మనోవేదనకు గురయ్యారు, వాటికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత చంద్రబాబు నాయుడుకి ఉంది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ లడ్డులో పిగ్ ఫ్యాట్ కలిసిందని చెప్పి, కాషాయ బట్టలు ధరించి మెట్లను శుభ్రం చెయ్యడం కాదు.. సీబీఐ ఇచ్చిన నివేదికలో జంతువుల



కొవ్వు, పంది కొవ్వు కలవలేదని స్పష్టంగా చెప్పింది దీనికి పరిహారంగా ఇప్పుడు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అంబటి రాంబాబు అనని మాటలు అన్నట్లుగా వక్రీకరించి, లేనిపోని గందరగోళాలు సృష్టించి, లడ్డూ వ్యవ హారం ప్రజల్లోకి చొచ్చుకుపోతున్న నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను నిలవరించాలని డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. మీరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు, చేసినా లడ్డు విషయంలో కూటమి నాయకులు చేసిన విష ప్రచారం ప్రజలకు అర్థమైంది. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలో ఉన్నాయన్నారు.అంబటి రాంబాబు మీద దాడి అమానుషం, లడ్డు విషయంలో చంద్రబాబుని నిలదీస్తున్నాడనే నెపంతో టిడిపి నాయకులు ఈ దాడికి పాల్పడడం దురదృష్టకరం అన్నారు. గతంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక పథకాలు ప్రజలకు అందజేశారనీ తెలియజేశారు. చంద్రబాబు సూపర్ సిక్స్ అని చెప్పి అధికారంలోకి వచ్చి, ఒక పెన్షన్ తప్ప మరే పథకం సరిగా అమలు చేయక పోవడంతో పేద ప్రజలు అలమటిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ పెద్దమల్లు రమణారెడ్డి,బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని), అంజాద్, వైసీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షులు ఉయ్యాల ప్రతాప్ రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు బొర్రా సంతోష్ రెడ్డి, కేతు రామిరెడ్డి, ఏనుగు శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి అంబటి దిష్టిబొమ్మకు శవయాత్ర



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ ఆదివారం తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ఆధ్వర్యంలో అంబటి దిష్టిబొమ్మకు చావు డప్పు వాయిస్తూ శవయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. నిన్నటి రోజున ముఖ్యమంత్రి చంద్రబాబుపై మాజీ మంత్రి అంబటి రాంబాబు వాడిన అసభ్య పదజాలాలను నిరసనగా ఆదివారం కేంద్రమైన నెల్లూరు నగరంలోని వేదాయపాలెం సెంటర్ నుంచి అంబటి రాంబాబు దిష్టిబొమ్మకు శవ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా మతంగి కృష్ణ మాట్లాడుతూ.. అంబటి రాంబాబు, జోగి రమేష్, నాని లాంటి వాళ్ళని ఈ రాష్ట్రం నుంచి బహిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై వ్యాఖ్యలు చేస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాలని హెచ్చరించారు. అనంతరండేగ రవి రాఘవేంద్ర మాట్లాడుతూ.. మానాయకులు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అంబటి రాంబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో, శాంతి నాయుడు, ఉప్పు భాస్కర్, అరవ బాబు, సురాబత్తిన్ రవీంద్ర, బాలకృష్ణ యాదవ్, సత్తార్, సిద్దయ్య, గుద్దేటి చెంచయ్య. ఒలిపి దయాకర్. కొత్త చిన అంజనేయులు, యద్దల ప్రసాద్. మల్లీ సుబ్బరాయుడు, జహీర్ రమణయ్య నాయుడు, మాతంగి నరసింహులు ముజీర్ యస్ దానిగుంట గాని మోహన్, వడ్లమూడి సుమన్, సిసింద్రీ, హరిబాబు జానకిరామ్ రెడ్డి, సుబ్బు, నాగరాజు, జానకి రామయ్య, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కార్యవర్గంలో.. వైసీపీ నేత వేలూరు ఉమా మహేష్ చోటు

## ● వైసీపీ కార్యకర్తల సంబరాలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సూచనలు మేరకు, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోవేలూరు ఉమా మహేష్ కిరాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పదవి దక్కడంతో నెల్లూరు రాంజీ నగర్‌లోని వైసీపీ సిటీ ఆఫీసులో 46 డివిజన్ వేలూరు ఉమామహేష్ యువత హాజరై ఆదివారం సంబరాలు జరుపుకు న్నారు. ఈ సందర్భంగా వేలూరు ఉమా మహేష్ వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జి ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వేలూరు ఉమా మహేష్‌కి అభినందనలు తెలి యజేసి, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచిం చారు. పార్టీ ఆదేశాల మేరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా పనిచేస్తానని ఉమా మహేష్ తెలియజేశారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులుగా.. పేరుందిన వేలూరు ఉమా మహేష్ 20 ఏళ్లుగా పార్టీకి.. విశేష సేవలు అందిస్తు వస్తున్నారన్నారు. వైసిపి రాష్ట్ర పార్టీ అధినాయకత్వం




ఆయన సేవలను గుర్తించి, ఇప్పటికే జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న.. కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్‌ని వైయస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గంలో సంయుక్త కార్యదర్శిగా నియమించడం ఆయన సేవలకు ఇది ఒక గుర్తింపు అన్నారు. వేలూరు మహేష్ సేవలను పార్టీ వినియోగించుకొని భవిష్యత్తులో అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఈరోజు వేలూరు ఉమా మహేష్ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకి భవిష్యత్తులో మంచి విలువ, గౌరవం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాధాయ్య, సుబ్బారావు, ప్రభాకర్, సుమంత్, రోషన్, అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంపసముద్రంను సందర్శించిన ఆత్మకూరు ఆర్డీఓ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామాన్ని ఆత్మకూరు ఆర్డీవో బీ పావని ఆదివారం సందర్శించారు. ఇటీవల ఈ గ్రామంలో కిడ్నీ సమస్యతో కొందరు చనిపోవడం, ఆ వ్యాధితో మరికొందరు చికిత్స పొందుతూ ఉండడంతో గ్రామాన్ని నేడు నెల్లూరు జిల్లా వైద్యాధికారి, స్థానిక తహసిల్దార్ అనిల్ కుమార్ యాదవ్ అధికారులతో కలిసి ఆత్మకూరు ఆర్డీవో బి.పావని గ్రామాన్ని సందర్శించారు. ఇటీవల జిల్లా వైద్యశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించి నీటి నాణ్యతను పరిశీలించి కొన్ని బోరింగ్ లను మూసి వేశారు. అలాగే ఈ గ్రామంలోని వ్యాధి పీడితులుగా ఉన్న వారి రక్త నమూనాలు తీసుకొని వాటి ఫలితాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నేపథ్యంలో నేడు గ్రామంలో ఆర్డిఓ బిపావని సందర్శించి వ్యాధి పీడితులతో మాట్లాడారు. వీరికి కావాల్సిన వైద్య సేవలను అందించవలసిందిగా వైద్యాధికారులకు సూచించారు. అలాగే త్రాగునీటి అవసరాలకు కావలసిన ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు.

## యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి

### ● సామాజికవేత్త మాలకొండ రెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో యువత వ్యసనాలకు దూరంగా దేశభక్తిని పెంపొందించుకొని దేశ ప్రగతికి తోడ్పడాలని లోక్సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపక సభ్యులు ముదిగండ్ల మాలకొండ రెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం స్ఫూర్తితో స్వాతంత్ర సమరయోధులు భారత రాజ్యాంగ నిర్మాతలు కలలు కన్నా నవ సమాజాన్ని నిర్మించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. పెరుగుతున్న అవినీతిని నియంత్రించి ప్రజలకు స్వచ్ఛమైన పాలన అందించాలని ప్రభుత్వాలును కోరారు. ముఖ్యంగా పీడనలేని వివక్షత లేని అసమానతలు లేని సమసమాజ నిర్మాణానికి ప్రజాప్రతినిధులు రాజకీయ పార్టీలు కృషి చేయాలని కోరినారు ప్రజాస్వామిక వాదులు పౌర సంస్థలు యువతను నిరంతరం మేలుకొల్పి దేశభక్తిని పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు.

## ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ నియోజకవర్గంలోని 30వ డివిజన్ కొత్తూరు సిపిఎం శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, పట్ట ణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకం అమలు చేయా లని, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ నగర్, రవిచంద్ర కాలనీ, మల్లయ్య గుంట ప్రాంతాల్లో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి కండె కోటేశ్వరరావు ఆటో కార్మిక సంఘం కార్యదర్శి సయ్యద్ హామీద్ స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మధు పార్థివదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 16 డివిజన్ గుర్రాల మడుగు సంఘంలో వైసిపి నాయకులు అరకోణం మణి, తండ్రి మధు స్వర్గస్తులవడంతో.. మధు భౌతిక కాయానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని చంద్రశేఖర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 16 డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, వైసీపీ 16 డివిజన్ అధ్యక్షులు జయ రామిరెడ్డి, స్థానిక వైసిపి నాయకులు శశిరెడ్డి, షరీఫ్, రామిరెడ్డి, నరేంద్ర రెడ్డి, శ్రీరాములు రెడ్డి మస్తాన్, శాంభి తదితరులు పాల్గొన్నారు.

# అంబటి రాంబాబు దిష్టిబొమ్మ దహనం

- వ్యక్తిత్వ హననానికి పాల్పడే వారికి
- వెన్నులో వణుకు పుట్టేలా శిక్షలు ఉండాలి
- మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్ బాబు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్ల వైసిపి నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పొదలకూరులో టిడిపి శ్రేణులు ఆదివారం అంబటి రాంబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి, కాళ్లతో తన్నుతూ తగలబెట్టారు. ఆంబోతు రాంబాబు, గంట అరగంట, సంజనా సుకన్య అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు మాట్లాడుతూ.. నిస్తేజంగా ఉన్న వైసీపీలో ఉత్తేజాన్ని తీసుకొచ్చి స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం చేయడంలో భాగంగా వైసీపీ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా కుట్రలకు పాల్పడుతోందని అన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, అంబటి రాంబాబు, కాకాణి గోవర్ధన్ రెడ్డి లాంటి వాళ్ళ కుట్రలో భాగంగానే అలజడలు సృష్టించి, శాంతి భద్రతల సమస్యను సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. సభ్య సమాజం తలదించుకునేలా చంద్రబాబును బూతులు తిట్టడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టిడిపి శ్రేణులు ఆగ్రహంతో రగిలిపోతున్నాయని అంబటి రాంబాబును కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబటి రాంబాబుకు వేసే శిక్ష రాష్ట్రంలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ బూతు పురాణం మాట్లాడే వారికి వెన్నులో వణుకు పుట్టేలా ఉండాలని అన్నారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్లో రాష్ట్రవ్యాప్తంగా అంబటి రాంబాబు లాంటి అలభరోళ్ల చేత విద్వేషాలను రెచ్చగొట్టేలా ప్రణాళికలు రచించారని అన్నారు. గ్రామస్థాయి నుంచి ఎక్కడికక్కడ వైసిపి విద్వేషాలను కూటమినాయకత్వంలో అడ్డుకుంటామని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో కూడా అంబటి రాంబాబు లాగే కాకాణి గోవర్ధన్ రెడ్డి కూడా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని అది మళ్ళీ రిపీట్ అయితే అంబటికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు పూల ప్రశాంత్, జనసేన మండల కన్వీనర్ దాసినేటి అనిల్ కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, టిడిపి నాయకులు కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, అక్కెం సుధాకర్ రెడ్డి, సాధం గిరీష్, కలగట్ల సందీప్, అనిశెట్టి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# చవటపాలెం-కనుపూరు తారు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలంలోని చవటపాలెం నుంచి కనుపూరు వరకు రూ.1.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారు రోడ్డు పనులకు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్, ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు రూ.350 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ రోడ్డు పూర్తయితే చవటపాలెం, కనుపూరు గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభమవుతాయని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# నెల్లూరు రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ప్రసాద్ బాధ్యతలు



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ.. నెల్లూరు సర్కిల్ కార్యాలయం ఆధీనంలో ఉన్న రూరల్ విద్యుత్ ఆపరేషన్ డివిజన్ నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఎల్.ప్రసాద్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా.. గూడూరు సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వర్తిస్తున్న ఎల్. ప్రసాద్ పదోన్నతి పొంది నెల్లూరు రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోస్టింగ్‌తో నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎల్ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పలువురు ఇంజనీరింగ్, అకౌంట్స్ విభాగాలకు చెందిన అధికారులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, వివిధ అసోసియేషన్‌ల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బాధ్యతలు తీసుకున్న ఎల్.ప్రసాద్ మాట్లాడుతూ.. నెల్లూరు రూరల్ డివిజన్ పరిధిలో వినియోగదారులకు అంతరాయరహిత, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు తన సర్వశక్తులను వినియోగిస్తానని తెలిపారు. అలాగే అధికారులూ, సిబ్బంది అందరినీ కలుపుకుని సమన్వయంతో పనిచేస్తూ శాఖ పరమైన అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

# బీసీవై పార్టీ జిల్లా కన్వీనర్‌గా బుధవరపు బాలాజీ



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నగరంలో గల వనం తోపు సెంటర్ నందు దీజ్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఫిబ్రవరి 1న బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ నెల్లూరు జిల్లా పార్టీ కార్యవర్గాన్ని ప్రకటించటం జరిగింది. ఈ నియామకములో రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీలోకి సన్నిబోయిన సుబ్రహ్మణ్యంని, జిల్లా బీసీవై పార్టీ కన్వీనర్‌గా బుధవరపు బాలాజీని, రాష్ట్ర బీసీవైపార్టీ ఈసీ మెంబర్లుగా వేల్పుల రామ్మోహన్ యాదవ్, సోమ గోపాల్, నక్క దినేష్ యాదవ్ గార్లను నియమించడం జరిగింది. అదే క్రమంలో రాష్ట్ర యువత కోకన్వీనర్లుగా తిపిరి బోయిన రమేష్, ఉల్లిపాయల లీలా కృష్ణ, నెల్లూరు జిల్లా యువత కన్వీనర్‌గా పామూరు హరినాథ్, కో కన్వీనర్‌గా కొణిదెల నాగేంద్రలను నియమించారు. పై నియామకానికి జాతీయ అధ్యక్షులు రామచంద్ర యాదవ్‌కి పై సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు నెల్లూరు జిల్లా కమిటీ ద్వారా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ సానుభూతిపరులు యనమల నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జానపాటి రామసుబ్బయ్య, బొర్రు రమేష్ కప్ప మురళీమోహన్ రాజు, మొగత్తూరు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరి అమ్మవారి ఊంజల్ సేవ



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం దుర్గామిట్టలో వేంచేసి యున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము నందు అదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా సాయంత్రం దేవస్థానం అనివెట్టి మండపం నందు ప్రత్యేక పుష్పాలంకరణతో శ్రీ అమ్మవారికి ఊంజల సేవ కార్యక్రమం నిర్వహించటం జరిగినది. ఊంజల సేవ కార్యక్రమంకు ఉభయకర్తలుగా సుధాకర్ రెడ్డి, స్వర్ణ, అమ్ముల్ అటో మొబైల్స్ వారు వ్యవహరించారు. ఊంజల సేవ కార్యక్రమములో వీణాకచ్చేరి, కోలాటం వైభవంగా నిర్వహించడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించుట జరిగింది. పై కార్య క్రమములో అలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి జనార్ధన్ రెడ్డి, అలయ ప్రధాన అర్చకులు, ఎఫిషియో సభ్యులు రఘురామమూర్తి, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో జరిగినవి.

# అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కోర్ట్ సమీపంలోని గౌడ్ కాంప్లెక్స్ ప్రధాన రహదారిపై ఉన్న కరెంటు తీగలపై నుంచి చైనా మాంజా దారం వేలాడుతూ ఉండడంతో ప్రమాదకర పరిస్థితి ఆదివారం ఏర్పడింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులకు ప్రాణాపాయం ఏర్పడే పరిస్థితి నెలకొంది. అదే సమయంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ అటుగా వెళుతున్న చిన్న బజార్ సబ్ ఇన్స్పెక్టర్ అబ్దుల్ రజాక్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకున్న ఎస్ఐ తక్షణమే స్పందించి ఎలాంటి ఆలస్యం చేయకుండా సుమారు 30 నిమిషాల పాటు స్వయంగా శ్రమించి చైనా మంజాను కరెంటు తీగలనుంచి పూర్తిగా తొలగించి రహదారిని సురక్షితంగా మార్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ సమయస్ఫూర్తి, అప్రమత్తత వలన ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనతో రహదారిపై వాహనాలు రాకపోకల వల్ల ఏర్పడిన అంతరాయం తిరిగి సాధారణ స్థితికి చేరుకుంది. విధి నిర్వహణలో నిబద్ధత, ప్రజా భద్రత పట్ల ఉన్న కర్తవ్య భావం ప్రశంసనీయమని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఈ సందర్భంగా ఎస్ఐ అబ్దుల్ రజాక్‌ను అభినందించారు. అంతేకాకుండా స్థానిక ప్రజలు, వాహనదారులు ఎస్ఐ అబ్దుల్ రజాక్‌కి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు అదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా దేవస్థానం అనివెట్టి మండపం నందు ప్రత్యేక పుష్పాలంకరణతో శ్రీ సత్యనారాయణ స్వామి వారి అలంకారం ఏర్పాటు చేసి సత్యనారాయణ స్వామి వ్రతమును సామూహికముగా నిర్వహించటం జరిగింది. వ్రతంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి ప్రతిమ, సత్యనారాయణ స్వామి వారి ప్రసాదము ఇవ్వడం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీస్వామి వార్ల తీర్థ ప్రసాదములు స్వీకరించుట జరిగింది. పై కార్యక్రమంలో ఆలయ సహాయ కమీషనరు, కార్యనిర్వహణాధికారి జనార్ధన్ రెడ్డి, నాగమణి, తేజ, రాధా కుమారి, ఆలయ ప్రధాన అర్చకులు, ఎఫిషియో సభ్యులు సూరావఝుల రఘురామమూర్తి, వేదపండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో జరిగినవి.

# మెడికల్ క్యాంపును ప్రారంభించిన ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 48వ డివిజన్ కోటమిట్టలో వైసీపీ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షులు షేక్ సిద్దిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును వైఎస్‌ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపులో పేదలకు అందిస్తున్న వైద్య సేవలను చంద్రశేఖర్‌రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా మైనార్టీ అధ్యక్షులు సిద్దిక్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయడం ఎంతో సంతోషకరమన్నారు. మెడికల్ క్యాంపు ద్వారా పేదల అనారోగ్య సమస్యలకు సంబందించి ఉచిత కన్సల్టేషన్‌తోపాటు ఉచితంగా మందులు అందజేయడం సంతోషకరమని తెలిపారు. సిద్దిక్ సేవా దృక్పథంతో అనేక సేవా కార్యక్రమాలు చేస్తుండడం చూశామన్నారు. మైనార్టీలకు సంబంధించి ఎప్పుడు ఏ కార్యక్రమం తలపెట్టిన అందులో పేద ప్రజలకు సేవ చేయాలనే దృక్పథం సిద్దిక్ సేవా కార్యక్రమాల్లో మెండుగా కనిపిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో సిద్ధిక్ మరిన్ని సేవ కార్యక్రమాలు తలపెట్టి పేద ప్రజలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మైనార్టీ స్టేట్ జనరల్ సెక్రెటరీ ఖలీల్ అహ్మద్, వైసిపి మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి సమీర్ ఖాన్, వైసిపి నగర నియోజకవర్గ మైనార్టీ విభాగం అధ్యక్షులు అబ్దుల్ మస్తాన్ వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయకృష్ణరెడ్డి, వైసిపి నాయకులు షాకీర్ బాబా, ఆవుల నాగేంద్ర, వెంకట శేషయ్య రమీజా, సుభాహని జియావుల్లా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ పారా మిలేటరీ దళాల సమావేశం



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని మాజీ పారా మిలటరీ దళలా సమావేశం టౌన్ హాల్‌లో ఉదయం జరిగింది. మాజీ పారామిలటరీ దళాలు మూడు నెలల కో ఒకసారి జరిగే సమావేశం జరిగింది. సమావేశం ముఖ్య ఉద్దేశం, మాజీ పారామిలటరీ దళాలుకి అర్ధ సైనిక్ భవనం నిర్మాణం కోసం ఎక్కడ నిర్మించాలి అనే విషయం మీద, కమిటీ సభ్యులు బదిలీ కోసం సమావేశంలో చర్చించడం జరిగింది. మినీ బై పాస్ వద్ద అమ్మ ఫర్నిచర్ స్థలం ఇరిగేషన్ డిపార్ట్మెంట్ వారు అర్ధ సైనిక్ భవనం కోసం ఇచ్చారు. దాని నిర్మాణం ఎలా చేయాలిఅనేది సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ ఎ.నారాయణస్వామి, వైస్ ప్రెసిడెంట్ పి.సురేష్, సెక్రటరీ అంకుపల్లి పాల్, ట్రెజర్ పి.స్వామిదాస్, అసోసియేషన్ సభ్యులు అందరూ పాల్గొన్నారు.

# బీసీ వసతి గృహ విద్యార్థులకు భోజనం అందజేత

- చక్కటి విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలి
- సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరయ్య యాదవ్

**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ఆదివారం దేవళ్ల రేవంత్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని రుచికరమైన వంటకాలతో తయారుచేసిన భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సేవా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకర యాదవ్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి అందరికి పంచి పెడుతూ దైవ సమానులైన విద్యార్థులంతాముక్తకంఠంతో దేవళ్ళ రేవంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఉల్లిపాయల శంకరయ్య యాదవ్ మాట్లాడుతూ.. సామాన్య మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని క్రమశిక్షణతో కూడిన చక్కటి విద్యాభ్యాసంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థి దశ నుంచి విద్యుత్‌తోపాటు మంచి గుణాలు, సేవాభావదృక్పథాలను అలవర్చుకోవాలన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు పేదరికం అడ్డురాదన్న వాస్తవాలను ప్రతి విద్యార్థి గ్రహించి కృషి పట్టుదలతో విద్యాభ్యాసంతోపాటు క్రీడల్లోనూ ప్రగతి సాగించాలని, చదువు చెప్పిన ఉపాధ్యాయులకు, కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. బీసీ వసతి గృహంలో నాణ్యమైన భోజన వసతులు కల్పిస్తున్న వార్డెన్ మస్తానయ్యకు అభినందనలు తెలిపారు. పర్యవేక్షణ సామర్థ్యం కలిగిన జిల్లా బీసీ సంక్షేమ అధికారి మార్గదర్శకాలను శిరోధర్యంగా భావిస్తూ ముందుకెళుతున్న వార్డెన్ మస్తానయ్య, చక్కటి పనితీరు కలిగిన వర్కర్లు ఉన్నారని, వారు అందిస్తున్న ప్రోత్సాహం విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుండడం శుభ పరిణామమన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్న బిసి విద్యార్థులంతా అత్యధిక మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవళ్ల రేవంత్‌తోపాటు కుటుంబ సభ్యులు, బీసీ సంక్షేమ వసతి గృహం ట్యూటర్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.





## నరేంద్ర మామ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు 16 డివిజన్ గుర్రాల మడుగు సంఘంలో వైసిపి నాయకులు నరేంద్ర మామ వెంకటేశ్వర్లు ఇటీవల పరమపదించడంతో వారి కుటుంబాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో 16 డివిజన్ కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్ రెడ్డి, వైసీపీ 16 డివిజన్ అధ్యక్షులు జయరామిరెడ్డి, స్థానిక వైసిపి నాయకులు శశిరెడ్డి, షరీఫ్, రామిరెడ్డి, నరేంద్ర రెడ్డి, శ్రీరాములు రెడ్డి మస్తాన్, శాంభి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలి



**బుచ్చిరెడ్డిపాళెం, మేజర్‌న్యూస్ :** పార్టీని ప్రజలకు మరింత చేరువయ్యేలా చూడాలని ఆ పార్టీ మండల అధ్యక్షులు మాధవ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని జొన్నవాడ గ్రామంలో జరిగిన గ్రామ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ.. గ్రామంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలలో జనసేన పాత్ర ఉండాలని, అదేవిధంగా గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా ప్రతి జనసైనికుడు పని చేయాలన్నారు. రానున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గ్రామంలో గతంలో కంటే ఎక్కువ మంది సభ్యులను చేర్పించేందుకు అందరు కృషి చేయాలని మాధవ్ కోరారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ గ్రామ జనసైనికులు మల్లి, శ్రీనివాసులు, జయరాం, ప్రసాద్, మండల జనసైనికులు సురేష్, అభి, సాయి, సురేంద్ర, బాబు, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి కళ్యాణోత్సవ వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్‌లోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా ఆదివారం దేవస్థానం నందు జరిగిన శ్రీవారి కళ్యాణోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. మాఘపౌర్ణమి శ్రీమహావిష్ణువుకు అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా ప్రారంభమైన శ్రీ కామాక్షి నిత్య హోమం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని జొన్నవాడ క్షేత్రంలో భక్తుల ఆధ్యాత్మిక శ్రేయస్సు కోసం శ్రీ కామాక్షి నిత్య హోమం ఆదివారం ఘనంగా ప్రారంభించడం జరిగిందని దేవస్థాన అధికారులు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10:00గంటలకు ఆలయంలోని యాగశాల నందు ఈ నిత్య హోమం నిర్వహించబడుతున్నది. ఈ హోమం ద్వారా అమ్మవారు షోడశీ స్వరూపంలో భక్తులకు అనుగ్రహం ప్రసాదిస్తారని, కుటుంబ శాంతి, ఆరోగ్యం, ఐశ్వర్యం, సంతానాభివృద్ధికి ఇది అత్యంత ఫలప్రదమని పండితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అశోక్ రెడ్డి దేవస్థాన కార్యనిర్వహణ అధికారి వెంకట శ్రీనివాసులు రెడ్డి, పాలక మండలి సభ్యులు శివకృష్ణ, వరలక్ష్మి, శ్రీనివాసులు, ప్రత్యూష, అర్చక స్వాములు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. కామాక్షి నిత్య హోమం ఆర్జిత సేవ టిక్కెట్ రూ.2116/-గా నిర్ణయించబడినదని తెలిపారు. ప్రతి రోజు పరిమితి 3 టిక్కెట్లు మాత్రమే భక్తులు (ఏపిటిఈఏంపిఎల్ఈఎస్) వెబ్సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా ఇంటి వద్ద నుండే ముందస్తు బుకింగ్ చేసుకునే సౌకర్యం కల్పించబడినదని దేవస్థాన అధికారులు తెలిపారు.

# బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేసిన జలదంకి బీజేపీ నాయకులు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్-2026పై అవగాహన కల్పించే ఉద్దేశంతో బీజేపీ జలదంకి మండల కార్యాలయంలో బడ్జెట్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల బీజేపీ అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి కార్యకర్తలు విశేషంగా హాజరయ్యేలా ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా 9వసారి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం దేశ చరిత్రలో అరుదైన ఘట్టమని, ఇది ఆమెకు ఉన్న ఆర్థిక పరిజ్ఞానం, ధైర్యం, క్రమశిక్షణకు నిదర్శనమని ఈ సందర్భంగా ఆమెను హృదయపూర్వకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి వద్దే శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్-2026 దేశ అభివృద్ధితో పాటు సాధారణ ప్రజలు, రైతులు, యువత, మధ్యతరగతి వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించబడిందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ ద్వారా పన్ను భారం తగ్గేలా చర్యలు తీసుకున్నారని, ఆరోగ్య రంగంలో మందుల ఖర్చులు తగ్గే అవకాశం ఉందని, మౌలిక వసతులు, రోడ్ల అభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని వివరించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, దేశ ఆర్థిక స్థిరత్వం కోసం కట్టుబడి ఉందని, బడ్జెట్-2026 అందుకు స్పష్టమైన ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. ఈ బడ్జెట్‌పై జలదంకి బీజేపీ పార్టీ సభ్యులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు బండారు తిరుపతి రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చల్లా హనుమ రెడ్డి, వంటేరు రాకేష్, మండల ఉపాధ్యక్షుడు మాథిన వెంకటరావు, బాలకోటయ్య యాదవ్, యువ మోర్చా మండల అధ్యక్షులు అతిన చైతన్య యాదవ్,ప్రవీణ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెలుగొండతో మెట్ట ప్రాంతాల సాగు, తాగునీటి కష్టాలు తీర్చాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వెలుగొండ, పెద్దిరెడ్డిపల్లి, సీతారాంసాగర్ రిజర్వాయర్లను వెంటనే పూర్తి చేసి మెట్ట ప్రాంతాల్లో సాగు, తాగునీటి కష్టాలు తీర్చి వలసలు నివారించాలని వెలుగొండ సాధన కమిటీ, రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో వెలుగొండ సాధన కమిటీ, ఏపీ రైతుసంఘం ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, రైతులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరాలంటే ఆయా ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలన్నారు. 1996లో వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి పునాది వేశారని, అప్పటి నుంచి ప్రాజెక్టు పనులు నత్తతో పోటీ పడుతున్నాయన్నారు. 65శాతం పనులు పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టుకు ప్రస్తుతం జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో రూ.4,500కోట్లు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే అసంపూర్తి పనులతో మిగిలిన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ను పూర్తి చేయడం తోపాటు సీతారాంసాగర్ నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. ఆయా ప్రాజెక్టుల నిర్మాణాలతో మెట్ట ప్రాంత ప్రజల సాగు, తాగునీటి కష్టాలు తీరి బీడు భూములు సాగులోకి వస్తాయన్నారు. పాలకులు. అధికారులు ఆదిశగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, నాయకులు కోడె రమణయ్య, దస్తగిరిఆహ్మద్, రామిరెడ్డి, బాలయ్య, చంద్రశేఖర్రెడ్డి, నజీముద్దీన్, షంషీర్, బాలగురవయ్య, సీహెచ్ రమణయ్య, వెంకటయ్య, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశం : సీఐటీయు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రోడ్డు మార్గం వ్యాపారస్తుల సంక్షేమ సంఘం సిఐటియు నెల్లూరు రూరల్ విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశం కామ్రేడ్ మన్సూర్ భవనము వేదయపాలెంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రూరల్ అధ్యక్షులు మల్లా సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ.. సిఐటియు అన్ని కేంద్ర కార్మిక సంఘాలు ఉద్యోగ ఉపాధ్యాయ సంయుక్త కిసాన్ మోర్చా రైతు కౌలు రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12వ తేదీ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుంది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు స్వాతంత్రానికి ముందు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా చేయడం దుర్మార్గమైన చర్య వెంటనే నాలుగు నాలుగు కోడ్స్‌ను రద్దుచేసి రద్దుచేసి 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కార్మికులు ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానం రద్దయింది. దాని స్థానంలో 12 గంటల పని విధానం కొనసాగుతుంది బేర సారాలు ఆడే హక్కు హరించి వేసినారు సమ్మె చేసే హక్కు కాల రాయబడింది యూనియన్ పెట్టుకునే హక్కు కాల రాయబడింది గతంలో ఏడు మంది ఉంటే యూనియన్ పెట్టుకోవచ్చు ప్రస్తుతం యూనియన్ పెట్టుకోవాలంటే వంద మంది ఉండాలి. అదేవిధంగా ఈఎస్ఐ పీఎఫ్ హక్కులు అనుసరించి వేయబడ్డాయి. దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేసే దానిలో భాగంగా మంగళవారం నెల్లూరు టౌన్ హాల్ నందు సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కామ్రేడ్ కటారి అజయ్‌కుమార్, ఇతర కార్మిక సంఘాల నేతలు పాల్గొంటారు. కావున అన్ని రంగాల కార్మికులు ప్రజలు రోడ్డు మార్జిన్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. అనంతరం సమ్మె వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు రూరల్ ఉపాధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, షేక్ ఖాజావలి, పుట్టమ్మ పాల్గొన్నారు.



# అంబటి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..

**తెలుగు యువత ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీనాథ్**

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పట్ల రాష్ట్ర వైసీపీ నాయకులు మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గం తెలుగు యువత ఉపాధ్యక్షుడు తుమ్మల శ్రీనాథ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీ హోదా కూడా లేని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. అంబటిని చట్టపరంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బహిరంగ క్షమాపణ చెప్పాలని తెలుగు యువత ఉపాధ్యక్షుడు తెలిపారు.

# ఆత్మ నిర్భయ భారత్‌ను బలోపేతం చేసే బడ్జెట్

**బీజేపీ నేత మిడుతల రమేష్**



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** భారత్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నిర్మాణమయ్యే బడ్జెట్‌గా కేంద్ర బడ్జెట్ ఉందని బీజేపీ నేత మిడతల రమేష్ పేర్కొన్నరు. ఆంధ్రప్రదేశ్ ప్రజల అభివృద్ధిని కాంక్షించే బడ్జెట్‌ను కేంద్రం రూపొందించింది సముద్ర తీర ప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్లో జల రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది. బకింగ్ హోమ్ కెనాల్ ద్వారా తక్కువ రవాణా ఖర్చుతో వేగవంతంగా వాణిజ్య సరుకుల రవాణా అందుబాటులోకి వస్తుంది. ఆంధ్రసముద్ర తీర ప్రాంతంలో కొబ్బరి, గంధం చెట్లు ఏర్పాటు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్లో అరుదైన ఖనిజాలు వెలికితీతకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించబడ్డాయి. ప్రపంచ స్థాయి రాష్ట్ర రాజధానిగా అమరావతి నిర్మాణానికి నిధులు కేటాయింపు ఉంది. అత్యంత విలువైన గంధం చెట్ల వనాలు ఏర్పాటు ద్వారా అంతరించిపోతున్న ప్రకృతి సంపద వృద్ధి లోకి రానుంది. పాకిస్తాన్ చైనా బంగ్లాదేశ్లలో ఉన్న పరిస్థితులకు తగిన విధంగా రక్షణ రంగ బలోపేతానికి, రక్షణ రంగ రహస్య ప్రాజెక్టులకు అధిక నిధులులి కేటాయించబడ్డాయి. ఆత్మానిర్భర భారత్ దిశగా బడ్జెట్లో కేటాయింపులు ఉన్నాయని రమేష్ బడ్జెట్ పై వ్యాఖ్యానించారు.

# అంబటి బహిరంగ క్షమాపణ చెప్పేవరకు ఉపేక్షించేది లేదు : మన్నేటి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును రాయలేని చెప్పలేని పదాలతో దూషించిన వైసిపి నాయకుడు అంబటి రాంబాబు బహిరంగ క్షమాపణలు చెప్పేవరకు ఉపేక్షించేది లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మన ఫౌండేషన్ వ్యవస్థాపకులు మన్నేటి వెంకటరెడ్డి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి ప్రపంచ దేశాలు సైతం గౌరవించే మహోన్నత విజనరీ కలిగిన రాష్ట్ర ముఖ్యమంత్రిని అన్ పార్లమెంటరీ భాషతో బహిరంగంగా దూషించటం హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి మాటలే మాట్లాడుతూ.. అధికారం పోయినా కూడా ఇలాగే ప్రవర్తించడం ఏమిటని ప్రజలు బుద్ధి చెప్పినా కూడా బుద్ధి మారకపోవటం దురదృష్టకరమన్నారు. దేశ రాజకీయాలను సైతం మార్చే శక్తి సామర్థ్యాలు ఉన్న మహోన్నత నాయకుడిని దూషించటం సరికాదని ఈ ఉదంతంపై రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి భేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. 11 సీట్లకు పరిమితమైనప్పటికీ ప్రతిపక్ష హోదా కూడా లేకుండా పోయినప్పటికీ ఇంకా మార్పు రాలేదంటే ఆశ్చర్యంగా ఉందని ప్రజలు అన్ని గమనిస్తున్నారని బహిరంగ క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

**ప్రమాదాలకు కారణమయ్యేలా..**


# జలదంకి బైపాస్ ఇన్నర్ రోడ్డు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి బైపాస్ నుంచి ఊరిలోకి వచ్చే ఇన్నర్ రోడ్డు వద్ద ఏర్పాటుచేసిన నిర్మాణం ప్రమాదాలకు కారణమయ్యేలా ఉంది. ఎవరికి అర్థం కాని విధంగా, ఎలాంటి దిశ చూపించే బోర్డులు లేకుండా రోడ్డు నిర్మాణం చేసి ఆర్ అండ్ బి కాంట్రాక్టర్ వదిలేసారు. పగలైనా కొంచెం గొప్పో కనిపిస్తుండడంతో ద్విచక్ర వాహనదారులు, ఫోర్ వీలర్స్ నడిపే వాళ్ళు కొంచెం జాగ్రత్త వహిస్తున్నారు. రాత్రిపూట అయితే ఎలాంటి లైట్లు లేకుండా పోవడంతో డివైడర్లను ఢీకొనే ప్రమాదం ఉంది. పైగా గ్రామం నుంచి ఆ పరిసర ప్రాంతాలలో ఉండే ప్రయాణికులు కావలికి వెళ్లేందుకు బస్సు ఎక్కాలంటే ఆ సర్కిల్లోనే నిలబడాల్సి వస్తుంది. ఏ వాహనం పైకి వస్తుందో అర్థం కాని విధంగా ప్రయాణికులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని, బైపాస్ సర్కిల్లో ఫ్లడ్ లైట్లు, గ్రామానికి వచ్చే సర్కిల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, ప్రమాదాల భార్యను పడకుండా ప్రజలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

# అందరికీ ఆదర్శం, స్ఫూర్తిదాయం నాగరాజారావు

**▸ అట్టహాసంగా ఉద్యోగవిరమణ కార్యక్రమం ▸ ప్రశంశలఝల్లులు, సన్మానాల పరంపర**





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో ఉపాధ్యాయులకేకాకుండా అందరికీ ఆదర్శం, స్ఫూర్తిదాయకమైన మహోన్నతుడు రిటైర్డ్ టీచర్ పార్లపల్లి నాగరాజారావు అని పలువురు అతిథులు, బంధుమిత్రులు కొనియాడారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న నాగరాజారావు శనివారం ఉద్యోగ విరమణ గావించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పోతులూరయ్య అధ్యక్షతన ఉద్యోగవిరమణ సన్మాన కార్యక్రమం అత్యంత అట్టహాసంగా, కోలాహలంగా సాగింది. నాగరాజారావు-విజయలక్ష్మి దంపతులను పాఠశాల ప్రవేశద్వారం నుండి స్టేజివరకు విద్యార్థినిలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు రొట్టే వెంకటేశ్వర్లు స్వాగతించగా పోతులూరయ్య అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించగా వ్యాఖ్యాతగా మర్రిపాడు మండల ఉపాధ్యాయుడు, ఎమ్మార్పీ కలిశెట్టి రాజేంద్ర కుమార్ వ్యవహరించారు. ఆత్మకూరు మండల విద్యాశాఖాధికారులు సి.హెచ్.అనంతలక్ష్మి, చలపతి, తెలుగుభారతిసేవాసమితి గౌరవాధ్యక్షుడు ఎస్.వి.రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయుడు వెలిశెట్టి నారాయణరావు, మర్రిపాడు రిటైర్డ్ ఎంఈఓ జె.సత్యనారాయణ, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇ.మాలకొండరావు, కావాటి సురేష్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రమణయ్య, జి.నీరజ, ఏపియుడబ్ల్యుజె జిల్లా ఉపాధ్యక్షుడు, ఎల్ఆర్‌పల్లి ఉన్నతపాఠశాల ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మెన్ సోమా వెంకటసుబ్బయ్య, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. నాగరాజారావు వృత్తిపట్ల అత్యంత అంకితభావం, విధులపట్ల చిత్తశుద్ధి కలిగిన ఉపాధ్యాయుడని, అత్యంత నిరాడంబరుడు, సేవానిరతి కలిగిన వ్యక్తి, మంచితనానికి మారుపేరు, నిరంతరం చిరు నవ్వుతో వ్యవహరించే వ్యక్తి, అత్యంత మంచితనం కలిగిన వ్యక్తి అని, తీరికవేళల్లో ప్రజలకు ఉచితంగా వైద్యసేవలందించారని, తాను ఉపాధ్యాయుడుగా పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన బోధనగావించడంతోపాటు ఆయా పాఠశాలల అభివృద్ధికి, మౌళికవసతుల కల్పనకు ప్రత్యేక శ్రద్ధచూపి సఫలీకృతుడయ్యారని, సామాజికస్పృహ కలిగిన నాగరాజారావు ఉద్యోగ విరమణ బాధగా ఉన్నా అనివార్యమని అతిథులు పేర్కొన్నారు. ఆయన గుణగణాలను అతిథులు, పలువురు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఆయన సోదరులైన విశ్రాంత ఉపాధ్యాయుడు పార్లపల్లి హజపరత్తయ్య, ఉపాధ్యాయుడు పార్లపల్లి సుధాకర్‌రావు, తదితరులంతా ప్రశంశలవర్షం కురిపించారు. నాగరాజారావు దంపతులను అతిథులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, బంధువులు, కుటుంబసభ్యులు, సహపాటి ఉపాధ్యాయులు, ఉద్యోగులు శాలువాలు, పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు, కానుకలతో ఘనంగా సన్మానించారు. నాగరాజారావు మంచితనం, మానవత్వం, సేవానిరతి, నీతి, నిజాయితీ, నిబద్ధత తదితర లక్షణాలతో విజయవంతంగా ఉద్యోగ విధులు నిర్వహించి విరమణగావిస్తున్నారని, ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని వారంతా పేర్కొన్నారు. ఆద్యంతంఅత్యంత ఘనంగా కార్యక్రమం నిర్వహించగా సన్మానగ్రహీత నాగరాజారావు ప్రసంగంలో ఉద్వేగానికి గురయ్యారు. అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు, పూర్వవిద్యార్థులు నాగరాజారావు ఉద్యోగవిరమణ కేక్‌ను కట్‌చేయించి అందరికీ పంచిపెట్టారు. నాగరాజారావు అందరితో అత్యంత మమేకమై వ్యవహరించే ఉపాధ్యాయుడు కావడంతో ఆస్కూలు విద్యార్థులు పలువురు కంటతడిపెట్టడం గమనార్హం. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పోతులూరయ్య, ఉపాధ్యాయులు పి.ప్రసాద్, కె.సుబ్రహ్మణ్యం, రొట్టే వెంకటేశ్వర్లు, డి.మాల్యాద్రి, కె.సి.మస్తానయ్య, మహబూబ్‌ఖాన్, శ్రీదేవి(పిడి), ఇతర పాఠశాలల ఉపాధ్యాయులు గంజి పెంచలయ్య, చీమా రమణయ్య, వై.మోహన్‌రావు, చలపతి, ఎం.గంగాధరం, హెచ్.మోహన్‌కృష్ణ, హెచ్.హరికృష్ణ, ఎం.పెంచలరెడ్డి, మోహన్‌రావు, వి.మధుసూధనరావు, ఎస్.మురళీకృష్ణ, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ముమ్మరంగా పండుగలాగా ఫించన్ల పంపిణీ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని గ్రామాల్లో శనివారం సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ స్థాయిల్లో ఉన్న టిడిపి కార్యకర్తలు ఊరూవాడా ముమ్మరంగా పర్యటించి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎల్లెడలా పండుగవాతావరణం నెలకొనగా పెన్షనర్ల సంతోషానికి అవధుల్లేకుండా కన్పించింది. ప్రతి నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాల వ్యాధిగ్రస్థులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తుండడం, 1వ తేదీ సెలవుదినమైతే ముందురోజే పంపిణీ చేస్తుండడం తెల్సిందే. బుధవారం ప్రాత:కాలంనుండే వారంతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితోపాటు వారు ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. పట్టణంలో జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు పెన్షన్లు పంపిణీ చేయగా మండలంలోని వాసిలిలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకర పెంచలచౌదరి పెన్షన్లు పంపిణీ చేశారు. నువ్వురుపాడులో తెలుగుదేశం యూనిట్‌ఇన్‌చార్జ్ కొండ్రెడ్డి రమణారెడ్డి, టిడిపి కార్యదర్శి షేక్ ఖాజావలి, మస్తాన్‌వలి తదితరులు పెన్షన్లు పంపిణీ చేశారు. దేపూరులో టిడిపి నాయకుడు తూమాటి తిరుపతినాయుడు పెన్షన్లు పంపిణీ చేయగా ఆత్మకూరులోని 20వవార్డులో జోరు వానలోకౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెన్షన్లు పంపిణీ చేయగా టిడిపి నాయకులు నాగులూరు చిన్నబ్బయ్య, గుర్నాధం శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు. 4వవార్డులో తెలుగుదేశం నాయకులు దాసరి మధుసూధనరావు, దాసరి బాలకృష్ణ, కాపా వెంకటసుబ్బయ్యలు పెన్షన్లు పంపిణీ



చేశారు. 2వవార్డులో కౌన్సిలర్ దగ్గుమాటి శివకోటారెడ్డి, 3వవార్డులో కౌన్సిలర్ గౌస్‌బాషా, 14వవార్డులో కౌన్సిలర్ పొడమేకల పెంచలయ్య యాదవ్, ఆరవేడుజంగాలపల్లిలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ తలచీరుబాబు నాయుడులు పెన్షన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నిర్ణయానుసారం, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్లవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని పేర్కొన్నారు. పట్టణంలోని వాడవాడలా పెన్షన్ల పంపిణీలో మున్సిపల్ కమీషనర్ సి.గంగాప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, వైస్‌చైర్మెన్ సర్ధార్, టిడిపి నాయకులు కొప్పోలు చిన్నపురెడ్డి, తదితరులు కార్యక్రమంలో పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు. ఆత్మకూరు మండలంలోని అన్నిగ్రామాల్లో, మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డుగ్రహీత ఎస్ఐను సన్మానించిన నేతలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతగణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ అవార్డును అందుకున్న ఆత్మకూరు ఎస్ఐ షేక్ జిలానీని శనివారం పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిలాని జిల్లాస్థాయిలో ఉత్తమ ఎస్ఐగా ఎంపికై జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా, జిల్లా ఎస్పీ అజితవేజెండ్ల చేతులమీదుగా అవార్డును స్వీకరించిన విషయం విధితమే. కాగా 20వవార్డు మున్సిపల్ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ జిలానీని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఐ తమ వృత్తిపట్ల అత్యంత గౌరవం కలిగి విధులను సమర్ధవంతంగా నిర్వహిస్తూ ఇటు ప్రజల, అటు ఉన్నతాధికారుల మన్ననలు పొందారని, నేరాల అదుపు, ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన సమర్ధవంతంగా వ్యవహరిస్తుంటారని, ప్రజలకు అన్యాయం జరిగితే వెంటనే స్పందించి విచారించి తగు న్యాయం చేస్తుంటారని భాస్కర్‌రెడ్డి ఎస్ఐ సేవలను కొనియాడారు. ఎస్ఐ జిలాని భవిష్యత్తులో మరిన్ని పదోన్నతులు పొందాలని, జిల్లా,రాష్ట్రస్థాయి అవార్డులు కైవసం చేసుకోవాలని భాస్కర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు దగ్గుమాటి శివకోటారెడ్డి, పొడమేకల పెంచలయ్యయాదవ్, షేక్ మహబూబ్‌బాషా, టిడిపి నాయకులు నాగులూరు చిన్నబ్బయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, రామకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యుహెచ్‌సిలో గాంధీ వర్ధంతి, స్పర్ష్‌లెప్రసి సదస్సు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో శుక్రవారం గాంధీవర్ధంతి, స్పర్ష్‌లెప్రసి అవేర్‌నెస్ కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత యుహెచ్‌సి వైద్యాధికారిణి షేక్ అస్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్పర్ష్‌లెప్రసి అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ అవగాహనా కార్యక్రమం జనవరి 30నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు నిర్వహిస్తామని డాక్టర్ అస్మా పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈసదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుష్టు వ్యాధి పూర్తిగా నయమయ్యే వ్యాధి అని, అందుకు అవసరమైన మందులను ప్రభుత ఆస్పత్రుల్లో ఉచితంగా అందుబాటులో ఉంటాయన్నారు. ఎంబిటి చికిత్స ద్వారా లెప్రసి పూర్తిగా నయం అవుతుందని ఆమె తెలిపారు. లెప్రసి బాధితులపట్ల ఎవరుకూడా వివక్ష చూపరాదన ఆమె సూచించారు. మానవీయధృక్పధంతో చూడాలని, అవసరమైతే వారికి సాయమందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అచ్చమాంబ పొంగళ్ళు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ ఆలయం వద్ద ఆదివారం భక్తులు ఘనంగా పొంగళ్ళు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాసాలు ఉండి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నెలకొన్న ఈ ఆలయం వద్దకు సుదూర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ కమిటీ ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

## మేకపాటి శాంతకుమారికి శుభాకాంక్షలు



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నెల్లూరులో ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేకపాటి శాంతకుమారికి ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మర్రిపాడు మండల టీడీపీ అధ్యక్షులు దేవరాల గంగాధర్ యాదవ్‌లు శుభాకాంక్షలు తెలియజేశారు. అంతేకాకుండా మండలంలోని వివిధ గ్రామాల నుంచి టిడిపి శ్రేణులు హాజరై అభినందనలు తెలియజేశారు.

# కసుమూరులో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, నిత్యాన్నదాన కేంద్రం ప్రారంభం



## మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : మంత్రి ఎన్ఎండి ఫరూక్



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మహిళల ఆర్థిక స్వావలంబనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర న్యాయ, చట్టం, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం కసుమూరు దర్గా ప్రాంగణంలో స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్‌లతో కలిసి వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌తో పాటు భక్తుల కోసం నిత్యాన్నదాన కేంద్రాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా కసుమూరు దర్గా దర్శించుకున్న మంత్రి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేదలు, మైనార్టీ వర్గాలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేలా వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కేంద్రాల ద్వారా మహిళలకు వివిధ వృత్తుల్లో నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి జరుగుతోందన్నారు. దర్గా అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు భోజన సౌకర్యం కల్పించే ఉద్దేశంతో నిత్యాన్నదాన కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతంలో ఉపరాష్ట్రపతిగా పనిచేసిన శ్రీ వెంకయ్య నాయుడు దర్గా అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. తన బాల్యం దర్గా సమీపంలోనే గడిచిందని పేర్కొన్న మంత్రి, భవిష్యత్తులో దర్గా అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మైనార్టీ వర్గాల ప్రజలు ఈ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. మంత్రి ఫరూక్, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో దర్గాలో రెండు ముఖ్యమైన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ఆనందకరమన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం విస్తృతంగా కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. దర్గా ప్రాంగణంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప ఆలోచనగా పేర్కొన్నారు. అలాగే నిత్యాన్నదాన కేంద్రం భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సర్వేపల్లి ప్రజల తరపున మంత్రి ఫరూక్, అబ్దుల్ అజీజ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో త్వరలోనే 17 స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని బారాషాహీద్ దర్గా, ఏఎస్‌పేట దర్గాలలో కూడా స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మొదటగా కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభించి, తదుపరి కంప్యూటర్ ట్రైనింగ్, ఏఐ టెక్నాలజీ, డిజిటల్ రంగాల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని వివరించారు. చదువుకున్నవారితో పాటు చదువు రాని వారికి కూడా ఉపయోగపడే విధంగా శిక్షణ కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, వక్ఫ్ బోర్డు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్‌గా శాంతమ్మ ప్రమాణస్వీకారం

## మంత్రి ఫరూక్, సోమిరెడ్డి అభినందన



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మేకపాటి శాంతమ్మ ఆదివారం అట్టహాసంగా ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరులోని సీపీఆర్ కళ్యాణ మండపంలో జరిగిన శాంతమ్మ ప్రమాణ స్వీకార మహోత్సవంకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ హాజరయ్యారు. మంత్రి ఫరూక్‌తో కలిసి సోమిరెడ్డి జ్యోతి వెలిగించి ప్రమాణస్వీకార మహోత్సవాన్ని నిర్వహిమచారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజెర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, ఏపీ ఇన్ లాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం పాలకమండలి సభ్యురాలు పనబాక భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై శ్రీ రంగనాథుడు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రంగనాయకులపేట, శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి వారి దేవస్థానం నందు ఆదివారం మాఘ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ స్వామి వారికి బంగారు గరుడ సేవ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమైన గరుడ వాహన సేవలో స్వామి వారు భక్తులకు దివ్య మంగళ స్వరూపంలో దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు, మధుసూదన రావు, నరేంద్ర ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ వేడుకలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన అర్చకులు, కార్యాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## అద్భుతంగా లలితా సహస్రనామ గానామృతం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేట లో వెలసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం సాయంత్రం శ్రీ ముకుందా గీత భక్త మండలి గురువు, శారదమ్మ వారి బృందం శ్రీ లలితా సహస్రనామ తెలుగు గానామృతం పాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు కమిటీ ఛైర్మన్ సురేంద్ర యాదవ్, కార్యనిర్వహణాధికారి వి.గిరికృష్ణ, ట్రస్టుబోర్డు కమిటీ సభ్యులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో వెలసి ఉన్న శ్రీగంగవ మ్మ తల్లి ఆలయంలో ఆదివారం మాఘ పౌర్ణమి సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు, అభిషేకాలు చేపట్ట భక్తులకు దర్శనవి చ్చారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యంతోపాటు కాయా కర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

### మద్యం అమ్మడం వారి ఇష్టం..

# అడిగేవారెవరు !

● చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ ● ఎస్పీ సూచనలు సైతం బేఖాతార్..



స్టోన్ హౌస్‌పేట స్వాతి బార్



ఆత్మకూరు బస్టాండ్ సాగర్ వైన్స్


వనం తోపు సెంటర్ రోహిత్ వైన్స్


శెట్టిగుంట రోడ్డు పుష్ప బార్

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** పైనోడు మనోడు అయితే మనం ఏమి చేసిన చెల్లుబాటు అవుతుంది అన్నా విధంగా జిల్లాలో మద్యం షాపులు నడుస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో సమయ పాలన ఉండదు.. మరికొన్ని ప్రాంతాలలో బెల్టు షాప్‌లు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. రూరల్లో అయితే ఇష్టాను సారం.. అయినా పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తుండటంతో మరి బ్రాందీ షాపుల యజమానులు దందా విచ్చలవిడిగా సాగుతుంది ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హరినాధపురం పీకాక్ బార్ అండ్ రెస్టారెంట్


గాంధీనగర్ రోడ్డు ఎస్ఎస్ వైన్స్

## క్రమం తప్పకుండా పించన్ అందిస్తున్న కూటమి ప్రభుత్వం : తుమ్మల

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతి నెలమొదటి రోజునే వృద్ధులు, వికలాంగులు, కళాకారులు, వితంతువులు, దీర్ఘకాలవ్యాధిగ్రస్తులు తదితరులందరికీ వారి ఇళ్ళవద్దకే సచివాలయ సిబ్బంది వెళ్ళి పెన్షన్లు పంపిణీ చేస్తుందని, 1వతేదీ సెలవుదినమైతే ముందురోజే పెన్షన్‌లు అందిస్తున్నామని, తాము కూడా భాగస్వామ్యులవుతూ కార్యాక్రమాన్ని పర్యవేక్షిస్తున్నామని, పెన్షన్లు లబ్ధిదారులకు అందజేస్తున్నామని, తమ కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి, పెన్షనర్లపట్ల ఉన్న అభిమానం, ఆదరణకు నిలువెత్తు సాక్ష్యమని ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు, మున్సిపాలిటీ మాజీ వైస్‌చైర్మెన్ తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం ప్రాత:కాలంనుండే ఆయన పట్టణంలోని పలువార్డుల్లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందితోపాటు ఆయన ఇంటింటికెళ్ళి పెన్షన్లు పంపిణీ చేశారు. పట్టణంలో పెన్షన్ల పంపిణీని పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో 200రూపాయల పెన్షన్‌ను 2వేలరూపాయలకు పెంచారని, గత ప్రభుత్వం ఐదేళ్లపాటు 250వంతున 3వేల రూపాయలకు పెంచగా చంద్రబాబునాయుడు పదవిచేపట్టగానే నాలుగువేలకు పెంచడంతోపాటు మూడునెలల అరియర్స్‌ను కూడా కలిపి ఇళ్ళవద్దనే పంపిణీ చేయించారని పేర్కొన్నారు. నెల మొదటి రోజు



సెలవుదినమైతే ముందురోజే పెన్షన్ పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. అన్నివర్గాల సంక్షేమం, అన్నిప్రాంతాల అభివృద్ధితోపాటు అందరికీ ప్రతినెలా 1వతేదీనాడే పెన్షన్‌లను పంపిణీ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి నిర్ణయానుసారం, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో తామంతా పెన్షనర్ల ఇళ్ళవద్ద పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నామని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో తెలుగుదేశం ప్రజాప్రతినిధులు, నాయకులు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సర్వసభ్యుల సమావేశం విజయవంతం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బధిరుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వసభ్యుల సమావేశం విజయవంతంగా ముగిసింది. ఈ సమావేశానికి 80మంది బధిర సభ్యులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సమావేశానికి హాజరైన 80మంది బధిర సభ్యులకు భోజన సౌకర్యం కల్పించిన నెల్లూరు జిల్లా జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ నెల్లూరు జిల్లా బధిరుల సంఘం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు మరియు గౌరవాన్ని తెలియజేస్తున్నాము. నూనె మల్లికార్జున యాదవ్ ఈ ఉదార సహకారాన్ని సమావేశానికి హాజరైన అందరూ బధిర సభ్యులు ఎంతో అభినందించారు. ప్రజల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తున్న జనసేన పార్టీ, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ మా ప్రత్యేక ప్రశంసలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తాళ్లూరి వెంకట్ యాదవ్ వర్షావలం రాజేష్, రుషికేష్ యాదవ్, నెల్లూరు జిల్లా బధిరుల సంఘం నెల్లూరు జిల్లా చైర్మన్ మస్తానయ్య, ప్రెసిడెంట్ మల్లేశ్వర రావు, జనరల్ సెక్రటరీ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సంఘం మహిళ, యువజన విభాగం సదస్సు



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహిళా, యువజన సదస్సును నెల్లూరు నగరంలోని ఆమని గార్డెన్స్‌లో దువ్వూరు అరుణమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ పద్మజ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరపు లలితారాం యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో బిసి సంఘ నేతలు అందరూ ఐక్యంగా పనిచేసి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. బీసీ మహిళా, యువజన నేతలు బిసి సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు బిసి సంక్షేమ సంఘం మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు, జిల్లా అధికార ప్రతినిధి మునగాల లక్ష్మీ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నందిని యాదవ్, జిల్లా ఉపాధ్యక్షురాలు, ఉడతా శైలజ యాదవ్, జిల్లా కార్యదర్శి విజయ లక్ష్మి, యువజన విభాగం నేత పవన్ యాదవ్, నగర అధ్యక్షురాలు, పెయ్యాల అపర్ణ, సీనియర్ నాయకులు యనమల నాగేశ్వరరావు యాదవ్, వెంటేశ్వర్లు, రామ్మోహన్ యాదవ్, డాక్టర్ రాజేష్, పడాల గోపాల్ యాదవ్, రమేష్ కుల సంఘాల నాయకులు ప్రతినిధులు మహిళలు పాల్గొని విజయవంతం చేశారు.

## హమాలీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** సరుకుల రవాణా, నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఫిబ్రవరి 12 జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో యావత్తు కార్మిక వర్గం పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం నెల్లూరు సిటీ చిన్న బజారులో పండ్ల మార్కెట్ లోడింగ్ అండ్ అన్ లోడింగ్ హమాలీ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్ల మార్కెట్ హమాలి వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, అధ్యక్షులు ఏ.బసవయ్య మాట్లాడుతూ.. లక్షలాదిమంది హమాలీ కార్మికులు దృఢమైన బలంతో అనేక రకాల బరువులు మోస్తూ పనిచేస్తారని అన్నారు. అధిక బరువులు మోయడం వల్ల చిన్న వయసులోనే మోకాళ్ళు అరిగిపోవడం, కాళ్లలోని నరాల వాపు, వంకర్ల పోవడం లాంటి జబ్బులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. 50 సంవత్సరాలకి హమాలీ కార్మికులకు ప్రత్యేక పించను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు ఇవ్వాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాల పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 12 జరుగుచున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# పరీక్షల వేళ ప్రణాళిక బద్ధంగా చదవాలి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పరీక్షల సమయంలో కొన్ని మెలకువలను అందిపుచ్చుకుంటేనే విద్యార్థులకు భవిష్యత్తు ఉంటుంది విద్యార్థులకు వార్షిక పరీక్షలు వచ్చే మార్పులే ఆధారం అందుకే తల్లిదండ్రులు అధ్యాపకులు ఉపాధ్యాయుల దృష్టి అంత వార్షిక పరీక్షల పైనే ఉంది అందుకే ఈ ఏడాది మార్చి 16 నుండి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధనలు ప్రత్యేకత నిర్వహించి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పాఠశాల స్థాయిలో కళాశాల స్థాయిలో ఇంటర్ పరీక్షలు విద్యార్థులకు కీలకంగా ఉన్నాయి. ఇప్పటినుండే ఉన్నత విద్యకు పునాదిపడుతుంది టీనేజీ వయసులో విద్యార్థులు పలు వ్యాపకాలు షికార్లు, ఆకర్షణలు వేపు ముగ్గు చూపే అవకాశం ఉంది. ఈ సమయంలోనే విద్యాభ్యాసంనకు సమస్యలు ఎదురవుతాయి వీటన్నిటినీ అధిగమించి నిలిస్తేనే ఉత్తమ ఫలితాలు సొంతమవుతాయి. టీవీలను మర్చిపోవాలి. నేటితరం పిల్లలు టీవీలకు కూడా బానిసలు అవుతున్నారు చదవాల్సిన సమయంలో కూడా పుస్తకాలను కూడా పక్కనపెట్టి టీవీకి అతుక్కుపోతున్నారు. బాలికలైతే టీవీల్లో వచ్చే సీరియల్స్‌ను కూడా చూస్తూ కాలం వెలదీస్తున్నారు పరీక్షల సమయం దగ్గర పడే సమయంలో వీటికి దూరంగా ఉండాలి అవసరమైతే కేబుల్ కనెక్షన్లు కూడా తీసివేస్తే పిల్లలు చదువు పై దృష్టి సారించే అవకాశం ఉంటుంది పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు సినిమాలను చూడక పోవడం తరగతి గదుల్లో సినిమాల గురించి చర్చించుకోకపోవడం మంచిది.

**ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదవాలి :** ఉపాధ్యాయులు సూచించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా చదివి ఆయా జవాబులపై పట్టు సాధించాలి కొన్ని చిట్కాలు తప్పనిసరిగా పాటించి ప్రణాళికతో చదువుతూ క్రమం తప్పకుండా అభ్యసనం క్రమశిక్షణతో కూడిన ప్రిపరేషన్ ఒకరోజు ఒక సబ్జెక్టుపై టైం టేబుల్ వేసుకొని సిద్ధం కావాలి.

**ఒత్తిడిని జయించాలి :** పరీక్షలు అంటే పిల్లల్లో భయం పుడుతుంది అదేపనిగా ఆలోచించడం చర్చలు చేయడం మంచిది కాదు ఈ తరహా ఒత్తిడిని జయించేందుకు యోగా దోహదం చేస్తుంది. ధ్యానంతో ఏకాగ్రత పెరగడంతోపాటు మనసుకు ప్రశాంతత చేకూరుతుంది. అదేపనిగా చదువుతూ ఉండకుండా మధ్యలో కాస్త అలా బయటికి వెళ్లడం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించడం చేయాలి ఇష్టమైన పని చేయడం ద్వారా ఉపశమనం పొందవచ్చు.

**ఫోన్లకు దూరంగా ఉండాలి :** ప్రతి ఇంట్లో రెండు మూడు స్మార్ట్ ఫోన్‌లు ఉండడంతో పిల్లలు వాటిని వినియోగిస్తున్నారు. ప్రాథమిక స్థాయి నుంచి వీటి వినియోగం అధికమైంది ఈ ఫోన్లలో కొత్త రకం యాప్లతో పాటు ప్రపంచం మొత్తం అరచేతుల్లో కనిపించడంతో వీటికి పరిమితమై పోతున్నారు. దీంతో నిత్యం ఫేస్బుక్ వాట్సాప్ యూట్యూబ్ తదితర సోషల్ మీడియాకు విద్యార్థులు బానిసలుగా మారుతున్నారు. వీటిలో గేమ్స్ ఆడుతూ సమయాన్ని వృథా చేస్తున్నారు. ఈ ఫోన్ల ప్రభావం కంటి చూపుపై పడటంతోపాటు వారి ఆలోచనలు విధానాలలో మార్పులు వస్తున్నాయి తల్లిదండ్రులు వీటిని గుర్తించి ఫోన్లకు దూరంగా ఉంచాలి.

**ప్రణాళికే కీలకం :** పరీక్షలకు ఉన్న సమయం చదవాల్సిన సబ్జెక్టులు సిలబస్ అన్ని క్రమ పద్ధతిలో రాసుకొని వాటిని విభజించుకోవాలి ఇందులో పఠణా శక్తి చాలా ముఖ్యం శక్తికి మించిన లక్ష్యాన్ని ముందు ఉంచుకొని నిరోత్సాహ పడకూడదు ప్రణాళిక బద్ధంగా ఏ రోజుకు ఆరోజు అనుకున్న సిలబస్ ను పూర్తి చేయాలి.

**సానుకూల దృక్పథం ఉండాలి :** విద్యార్థులు పాజిటివ్గా ఆలోచించడం చాలా ముఖ్యం పరీక్షల దగ్గర పడుతున్న కొద్దీ చదవలేమో నన్న భయం చుట్టుముడుతుంది నిరుత్సాహాన్ని గురిచేస్తుంది ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు కీలకంగా వ్యవహరించాలి చదువు కెరియర్ రెండు ముఖ్యమైనవనీ చెప్పడంతోపాటు పరీక్షలు వీటిలో భాగమేనని భయపడకుండా వాటికి సిద్ధం కావాలి అని పిల్లల్లో అవగాహన కల్పించాలి ఫలితాల గురించి ఆలోచించకుండా వారిని సంసిద్ధం చేయాలి.

**గమనించాల్సిన విషయాలు :** పరీక్షలకు వచ్చే ప్రశ్నలన్ని మీరు చదివిన పుస్తకాలోనే ఉంటాయన్న వాస్తవాన్ని గ్రహించండి పరీక్షా సమయంలో చదివిన ప్రతి పాఠం గుర్తుకు వస్తుందని పదేపదే మనసులో అనుకుంటే ప్రయోజనం ఉంటుంది పాఠశాలలో రాసిన పరీక్ష లాంటిదే ఈ పబ్లిక్ పరీక్ష అని కూడా భావించాలి ఏకధాటిలో నాలుగైదు గంటలు చదవడం మంచిది కాదు గంట సేపు చదివి ఐదు నిమిషాలు గ్యాప్ తీసుకోవాలి ఉదయం నిద్ర లేచినప్పటి నుంచి 16 గంటలపాటు ఏమి చదివిన మనసు రిజిస్టర్ చేసుకుంటుంది అందుకే వేకువఝూమున లేచి చదివి రాత్రి త్వరగా పడుకోవాలి సెల్ఫ్ మోటివేషన్ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుంది

**ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి : ఎంఈఓ రమేష్**
విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కావాలి మీరు రాయగలిగినంతగా బాగా రాయండి మార్కుల గురించి కంగారు పడవద్దు స్వేచ్ఛగా ప్రశాంతంగా పరీక్ష హాల్లోనికి వెళ్ళండి పరీక్షా సమయంలో విద్యార్థులకు తల్లిదండ్రులు అండగా నిలవాలి.